# సాక్షి
# అనంతపురం

సోమవారం | 28 | ఆగస్టు | 2023






**వైఫల్యాలే విజయానికి సోపానాలు**
గ్రామీణ బాలికల అథ్లెటిక్స్–2023 పోటీలు ఆదివారం క్రీడాగ్రామంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

8లో



**టమాట కిలో రూ.28**
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.28 పలికింది. కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/23.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

## న్యూస్‌రీల్

### ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ



ఉరవకొండలో రైతులకు విత్తన పంపిణీ చేస్తున్న అధికారులు

**అనంతపురం అగ్రికల్చర్:** ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం విత్తనం అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఆదివారం నుంచి 80 శాతం రాయితీపై విత్తన పంపిణీ ప్రారంభించామన్నారు. 1,218 క్వింటాళ్ల పెసలు, 11,684 క్వింటాళ్ల ఉలవలు, 836 క్వింటాళ్ల అలసందలు, 516 క్వింటాళ్ల కొర్రలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాయితీ పోనూ కిలో ఉలవలు రూ.21.60, అలసందలు రూ.23, పెసలు రూ.23.50, కొర్రలు రూ.13.50 ప్రకారం పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఉలవలు గరిష్టంగా 25 కిలోలు, అలసందలు 20 కిలోలు, పెసలు 4 కిలోలు, కొర్రలు 2 కిలోలు చొప్పున ఇస్తామని తెలిపారు. వేరుశనగ పంట విస్తీర్ణం తగ్గినందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేసుకోవాలని సూచించారు.

### అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల



**అనంతపురం:** యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం చేపట్టనున్న వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి విడుదల చేసింది. సెప్టెంబర్ 6న ఐసెట్ (ఎంబీఏ, ఎంసీఏ), 11న పీజీ సెట్ (ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ), 26న ఏపీ లాసెట్, 30న ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ఉంటుంది.

### సబ్ జూనియర్ ఫుట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక



అంతర్‌జిల్లా టోర్నీకి ఎంపికైన క్రీడాకారులు

**అనంతపురం సెంట్రల్:** ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకూ విజయవాడలో జరిగే ఏపీ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా సబ్ జూనియర్ బాలుర జట్టును ఆదివారం ఎంపిక చేశారు. కడపలో జరిగిన జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుకున్న క్రీడాకారులను రాష్ట్ర స్థాయి టోర్నీకి ఎంపిక చేసినట్లు ఏడీఎఫ్ఏ అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి మల్లేష్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తెలిపారు. ఎంపికైన వారిలో దేరంగుల నాని, కార్తీక్, శివబాలాజీరెడ్డి, మనోజ్‌కుమార్, నంద వర్ధనసాయి, తేజేశ్వర్, శివాజీ, శ్యామలసాయి కిషోర్, తామన్, సుబాన్, సంతోష్‌కుమార్, హర్షవర్ధన్, మోజస్‌కుమార్, ఆదిత్యారెడ్డి, లక్ష్మీబాలాజీ, ఆకాష్యకుమార్, కృష్ణవీర్, యశ్వంత్‌రెడ్డి, ప్రభాష్ ఉన్నారు. జట్టుకు కోచ్‌గా ఆనంద్‌రెడ్డి, మేనేజర్‌గా చిన్నరాజ వ్యవహరించనున్నారు.

### 30న ఉద్యోగ మేళా



**అనంతపురం:** హైదరాబాద్‌లోని హెటిరో కంపెనీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 30న అనంతపురం శివారులోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉప్పరపల్లి రోడ్డులో ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయి. బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీకామ్, బీఏ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఉత్తీర్ణత సాధించి, 20 నుంచి 27 ఏళ్ల లోపు వయసున్న యువతీయువకులు అర్హులు. ఎంపికైన వారు హైదరాబాద్‌లోని హెటిరో కంపెనీలో వివిధ విభాగాల్లో పనిచేయాల్సి ఉంటుంది. వీరికి నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం ఇస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో ఈ నెల 30న జరిగే వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలి.

# స్వగృహమస్తు





రాప్తాడు లేఅవుట్‌లో పూర్తయిన ఇల్లు (ఇన్‌సెట్) ఉప్పరపల్లి లేఅవుట్‌లో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇల్లు

పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా 68,267 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేకంగా జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటు చేసింది. ఏకకాలంలో వేలాది ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఆర్థికస్తోమత లేని లబ్ధిదారులకు ఆప్షన్–3 కింద ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తోంది.

- సొంతింటి కల నెరవేరుతున్న వేళ..
- జిల్లా వ్యాప్తంగా 68,267 ఇళ్లు మంజూరు
- 30న సామూహిక గృహప్రవేశాలు
- ఆనందంలో పేదలు

**అనంతపురం టౌన్:** పేదలకు గృహ యోగం కలగనుంది. జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఈ నాలుగేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఈ స్థాయిలో ఇళ్లను మంజూరు చేయలేదు. ఒక్క అనంతపురం జిల్లాలోనే 68,267 ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 20,308 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో సాగుతున్నాయి. ఈ నెల 30లోపు మరో 29 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా గృహ నిర్మాణ సంస్థ అధికార యంత్రాంగం గట్టి చర్యలు చేపడుతోంది. ఈ నెల 30వ తేదీ 20,337 మంది లబ్ధిదారులతో సామూహిక గృహ ప్రవేశాలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు.

**ఆప్షన్–3 ఇళ్లు వేగవంతం..**

జిల్లా వ్యాప్తంగా 13వేల మంది లబ్ధిదారులు తమకు ఇళ్లు నిర్మించుకునే స్తోమత లేదని తెలిపారు. వీరి ఇళ్ల నిర్మాణాలను ఆప్షన్–3 కింద ప్రభుత్వమే చేపడుతోంది. కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్లు నిర్మిస్తోంది. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు, తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లోని జగనన్న లేఅవుట్లలో ఆప్షన్–3 నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 13వేల ఇళ్లలో ఇప్పటికే 4వేలకు పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో రెండు వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో సాగుతున్నాయి. ఆప్షన్–3 కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తయిన ఇళ్లను సైతం లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఆలమూరు లేఅవుట్‌లో అత్యధికంగా 1,500 ఇళ్లు లబ్ధిదారులకు అందజేయనున్నారు. వీటితోపాటు గుంతకల్లు నియోజకవర్గంలో 1000 ఇళ్లు ఆప్షన్–3 కింద నిర్మాణాలు పూర్తయ్యాయి. గృహ ప్రవేశాలను నిర్వహించి లబ్ధిదారులకు ఇంటి తాళాలను అందించనున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో ఊళ్లకు ఊళ్లనే నిర్మిస్తున్న జగన్ సర్కారుకు పేదలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**జిల్లా వ్యాప్తంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు**

| నియోజకవర్గం | మంజూరైన ఇళ్లు | పూర్తయిన ఇళ్లు |
|---|---|---|
| అనంతపురం | 18,407 | 2,239 |
| గుంతకల్లు | 9,336 | 3,105 |
| కళ్యాణదుర్గం | 5,056 | 1,717 |
| రాప్తాడు | 8,930 | 2,967 |
| రాయదుర్గం | 4,653 | 1,467 |
| శింగనమల | 3,365 | 2,259 |
| తాడిపత్రి | 7,277 | 1,241 |
| ఉరవకొండ | 11,243 | 4,991 |
| మొత్తం | 68,267 | 20,308 |

**పండుగలా గృహప్రవేశాలు**

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కలను ప్రభుత్వం సాకారం చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 20,337 ఇళ్లలో ఈ నెల 30న సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని పండుగలా చేపడుతున్నాం. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని తాడిపత్రి నియోజకవర్గం సజ్జలదిన్నె లేఅవుట్‌లో ఏర్పాటు చేశాం.

– నరసింహారెడ్డి, ఇన్‌చార్జ్ పీడీ, గృహనిర్మాణ సంస్థ

**కల సాకారమైంది**



కూలి పనులు చేసుకునే మేము అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నాం. సొంతిల్లు కావాలనేది మా కల. జగనన్న పాలనలో దరఖాస్తు పెట్టుకున్న వెంటనే ప్రభుత్వం స్థలం–పక్కాగృహం మంజూరు చేసింది. కూలి పనులకు వెళ్లి పోగు చేసుకున్న సొమ్ముతోపాటు ప్రభుత్వం అందించిన ఆర్థికసాయంతో ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేసుకున్నాం. ఈ నెలాఖరులో గృహ ప్రవేశం చేస్తున్నాం. ఎట్టకేలకు మా కల సాకారమైంది. – నరసమ్మ, కూడేరు

**ప్రభుత్వ సాయం మరువలేం**



అద్దె ఇంటిలో నివసిస్తున్నాం. దరఖాస్తు చేసిన తర్వాత అధికారులు ఇంటి వద్దకే వచ్చి ఇంటి నివేశన పట్టా అందించి, జగనన్న ఇంటిని మంజూరు చేశారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. త్వరలోనే నూతన ఇంటిలో అడుగుపెడుతున్నాం. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ సాయాన్ని మరచిపోలేము. – భవాని, ముదిగల్లు, కళ్యాణదుర్గం

### పశుపతినాథుని ఆలయానికి మహర్దశ

- ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చిన టీటీడీ




పశుపతి నాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తున్న టీటీడీ సూపరింటెండెంట్ ఢిల్లీరెడ్డి

**రాయదుర్గం రూరల్:** లింగాలబండపై వెలసిన పశుపతినాథుని ఆలయానికి మహర్దశ పట్టనుంది. ఆలయ అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ముందుకొచ్చింది. నేపాల్ తర్వాత మన దేశంలో రాయదుర్గం మండలం చదంగొల్లలదొడ్డి సమీపంలోని లింగాల బండపై మాత్రమే పశుపతి నాథుని ఆలయం ఉంది. 18వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారు. ఏకరాతి శిలతో శివలింగానికి నాలుగు వైపులా నంది విగ్రహాలుండడం ఇక్కడి విశిష్టత. లింగాలబండకు నీటి సౌకర్యం కల్పించి, సరైన మార్గం కూడా వేయాలని టీడీపీ హయాంలో అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు, జిల్లాపరిషత్ చైర్మన్ పూల నాగరాజును గ్రామస్తులు కోరినా పట్టించుకోలేదు. పట్టు వీడని గ్రామస్తులు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తేవడంతో ఆయన తాగు నీటి సౌకర్యం కల్పించడంతో పాటు గత ఏడాది చదం, రాయదుర్గం రోడ్డు నుంచి కొండవరకు బీటీ రోడ్డు వేయించారు. త్రిదండి చినజీయర్ స్వామీజీ సూచనలతో విప్ కాపు ఈ పురాతన ఆలయంలో వంటశాల, కమ్యూనిటీ హాలు ఏర్పాటుతో పాటు మరమ్మతులు చేయాలని టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విప్ కృషి ఫలించి నిధుల మంజూరుకు టీటీడీ ఆమోదించింది. ఈ మేరకు టీటీడీ సూపరింటెండెంట్ ఢిల్లీరెడ్డి ఆదివారం సాయంత్రం పశుపతినాథుని ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పరిసరాలు, నిర్మాణం చేపట్టడానికి అనువైన పరిస్థితులు, సౌకర్యాల కల్పనకు కావాల్సిన నిధుల అంచనా వేయడం కోసం పరిశీలనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పండితులు వేణుస్వామి, సర్పంచ్ వెంకటేశులు, గ్రామపెద్దలు, విజయ్‌రెడ్డి, మర్రిస్వామిరెడ్డి, ఈరణ్ణ, పూజారి జడప్ప తదితరులు పాల్గొన్నారు.

# 'పరిశ్రమి'స్తూ.. ఖ్యాతి పెంచుతూ!

పరిశ్రమల ఖిల్లాగా ఇప్పటికే శ్రీసత్యసాయి జిల్లా పేరు మార్మోగుతోంది. ఇక్కడి పరిశ్రమల్లో తయారవుతున్న ఉత్పత్తులు రమారమి 24 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దుస్తులు, మందులు, కార్లు వంటివి అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ ఎగుమతి అవుతున్నాయి. ప్రతి నెలా రూ.కోట్ల వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మరో రెండు నెలల్లో బెల్ సంస్థ ఏర్పాటుకు భూమి పూజ, నాసిన్ ప్రారంభోత్సవాలకు కసరత్తు జరుగుతోంది. ప్రఖ్యాతి పొందిన ఆ సంస్థల ఏర్పాటుతో జిల్లా ఖ్యాతి మరింత ఇనుమడించనుంది.

- జిల్లాలో కేంద్ర సంస్థల ఏర్పాటుపై సర్కారు శ్రద్ధ
- గత ప్రభుత్వ హయాంలో నెమ్మదించిన ప్రక్రియలు ప్రస్తుతం వేగవంతం
- ప్రభుత్వ చొరవతో అక్టోబర్‌లో బెల్ సంస్థ భూమి పూజకు కేంద్రం కసరత్తు
- అదే నెలలో నాసిన్ ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- పరిశ్రమలు వస్తున్న నేపథ్యంలో ఈఎస్‌ఐ ఆస్పత్రికి ప్రతిపాదనలు
- నాసిన్ ఎదురుగా ఐదెకరాల కేటాయింపు




**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** భారతదేశంలో 'బెల్' (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) అంటే తెలియని వారుండరు. రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థ యూనిట్‌ను పెనుకొండ నియోజకవర్గం పాలసముద్రం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. అక్టోబర్‌లో భూమి పూజ చేయనున్నారు. మొత్తం మూడు దశల్లో నిర్మాణ పనులు సాగనున్నాయి. తొలిదశలో రూ.384 కోట్లతో నిర్మిస్తున్నారు. 2016లో సంస్థకు స్థలాలు కేటాయించినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక బెల్ సంస్థతో ముమ్మర సంప్రదింపులు చేసి నిర్మాణానికి చొరవ చూపారు. అక్టోబర్‌లో తొలిదశ పనులకు భూమి పూజ చేయనున్నారు.

**2019 తర్వాత జిల్లాలో ఏర్పాటైన పరిశ్రమల వివరాలు..**

| | |
|---|---|
| లార్జ్ అండ్ మెగా ఇండస్ట్రీస్ | 22 |
| పెట్టుబడులు | రూ.14,790 కోట్లు |
| ఉద్యోగావకాశాలు | 12,785 |
| ఎంఎస్‌ఎంఈలు | 1,532 |
| పెట్టుబడులు | రూ.674 కోట్లు |
| ఉద్యోగావకాశాలు | 11,312 |

**నాసిన్ ప్రారంభోత్సవానికి కసరత్తు..**

నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్టర్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్) సంస్థ ప్రారంభోత్సవం చేయనున్నారు. కస్టమ్స్, ఇన్‌కం టాక్స్ అధికారులకు ఇక్కడే శిక్షణ ఇస్తారు. ఈ సంస్థ నిర్మాణం పూర్తయింది. మనదేశంలో ఎంపికైన వారే కాకుండా కొన్ని దక్షిణాది దేశాలకు సంబంధించిన అధికారులకూ శిక్షణ ఇవ్వనున్నారు. ఓవైపు బెల్‌కు భూమి పూజ, నాసిన్ ప్రారంభోత్సవం రెండూ ఒకేసారి చేయాలని, దీనికి ప్రధాని నరేంద్రమోడి రానున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

**ఈఎస్‌ఐ ఆస్పత్రికి ప్రతిపాదన..**

జిల్లాలో వందల సంఖ్యలో పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. సుమారు 50 వేల మంది కార్మికులు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేస్తే కార్మికులను సౌకర్యంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపింది. దీని కోసం నాసిన్ సంస్థ ఎదురుగా ఐదెకరాల స్థలం కూడా కేటాయించారు. ప్రస్తుతం ఫైలు కేంద్ర కార్మిక శాఖ పరిధిలో పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. తొలుత 50 పడకలతోనూ ఆ తర్వాత మరో 50 పడకలు పెంచనున్నట్లు సమాచారం.

**మా ప్రభుత్వం వచ్చిన తర్వాతే కదలిక**



గత ప్రభుత్వం కొన్ని సంస్థలకు భూములిచ్చినా, ఆ తర్వాత పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే వేగం పెంచాం. బెల్ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా ఆ సంస్థ ప్రతినిధులను ఒప్పించాం. నాసిన్ నిర్మాణాలు వేగవంతమయ్యేలా చేశాం. మరికొన్ని సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. – మెట్టు గోవిందరెడ్డి, చైర్మన్, ఏపీఐఐసీ

## తొలగింపు ఓట్లపై..
# నేటి నుంచి పునఃపరిశీలన

- గత ఏడాది జనవరి నుంచి 96,153 ఓట్ల తొలగింపు
- ప్రతి తొలగింపునూ పరిశీలించనున్న బీఎల్ఓ
- ఈఆర్ఓ, ప్రత్యేక అధికారి, కలెక్టర్ ర్యాండమ్ తనిఖీ



బీఎల్ఓలకు సూచనలిస్తున్న అనంతపురం ఈఆర్ఓ, ఆర్డీఓ మధుసూదన్

**అనంతపురం అర్బన్:** జిల్లాలో తొలగింపు ఓట్లపై సోమవారం నుంచి ఈ నెల 30 వరకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పునఃపరిశీలన చేపట్టనుంది. ఓట్ల తొలగింపుపై రాజకీయ పార్టీల నుంచి పోటాపోటీగా ఫిర్యాదులు అందుతుండడంతో వాటి పునఃపరిశీలనకు ఎన్నికల కమిషన్ సిద్ధమయ్యింది. ఈ క్రమంలో 2022 జనవరి 6 నుంచి ఈ నెల 9 వరకు ఇప్పటి వరకు డెత్, షిఫ్టింగ్ కారణంగా తొలగించిన ఓట్ల పరిశీలన చేపట్టనున్నారు. బీఎల్ఓ (బూత్ లెవల్ అధికారి) నుంచి కలెక్టర్ వరకు పునఃపరిశీలన ప్రక్రియను నిర్వర్తిస్తారు.

**2022 జనవరి 6 నుంచి ఈ నెల 9 వరకు తొలగించిన ఓట్లు**

| నియోజకవర్గం | తొలగించిన ఓట్లు |
|---|---|
| రాయదుర్గం | 6,222 |
| ఉరవకొండ | 5,595 |
| గుంతకల్లు | 10,868 |
| తాడిపత్రి | 15,943 |
| శింగనమల | 6,759 |
| అనంతపురం | 28,188 |
| కళ్యాణదుర్గం | 5,226 |
| రాప్తాడు | 17,352 |
| మొత్తం | 96,153 |

**క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన..**

జిల్లావ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో డెత్, షిఫ్టింగ్ కింద గత ఏడాది జనవరి 6 నుంచి ఈ నెల 9 వరకు 96,153 ఓట్లను తొలగించారు. తొలగింపు ఓట్ల పరిశీలన ఈ నెల 30లోగా పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రతి ఒక తొలగింపును బీఎల్ఓ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. తొలగింపు ఓట్లను ఈఆర్ఓ, ప్రత్యేక అధికారి, కలెక్టర్ క్షేత్రస్థాయిలో ర్యాండమ్ చెకప్ చేస్తారు. ఈఆర్ఓ (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి) కనీసం 1000 తొలగింపులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ప్రత్యేక అధికారి తన నియోజకవర్గం పరిధిలో కనీసం 500 తొలగింపులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. కలెక్టర్ స్వయంగా ప్రతి నియోజకవర్గంలో జరిగిన తొలగింపుల్లో కనీసం 100 తొలగింపులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఎవరి పేరునైనా ఓటరు జాబితా నుంచి పొరపాటున తొలగించి ఉంటే... అలాంటి వారు ఈఆర్ఓ వద్ద తమ పేరు నమోదుకు ఫారం–6 సమర్పించాలి.

# చురుగ్గా పంట నమోదు

- 2.50 లక్షల హెక్టార్లకు చేరుకున్న 'ఖరీఫ్' సాగు
- 1.20 లక్షల హెక్టార్లలో ఈ–క్రాప్ పూర్తి



బుక్కరాయసముద్రంలో ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

**అనంతపురం అగ్రికల్చర్:** ఖరీఫ్–2023 ఈ–క్రాప్ (పంట నమోదు) కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు చురుగ్గా కొనసాగిస్తున్నారు. ఏడీఏ, ఏఓల నుంచి ఆర్‌బీకే అసిస్టెంట్ల వరకు దీనిపై నిమగ్నమై పనిచేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంట రుణాల సున్నావడ్డీ, ఎంఎస్‌పీ ద్వారా పంట ఉత్పత్తుల అమ్మకాలకు ఈ – క్రాప్ ప్రామాణికం కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేసేలా ప్రణాళిక తయారు చేశారు. కాగా వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి ఖరీఫ్ సాగు మందకొడిగా కొనసాగుతోంది. జూలై చివర్లో, ఆగస్టు మొదటి వారంలో కురిసిన మోస్తరు వర్షాలకు సాగు విస్తీర్ణం బాగానే పెరిగింది. వ్యవసాయశాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం 3.70 లక్షల హెక్టార్లు అంచనా వేయగా... 67 శాతంతో 2.50 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చాయి. అందులో ప్రధాన పంట వేరుశనగ 2.31 లక్షల హెక్టార్లకు గాను 1.22 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగైంది. అయితే మొక్కజొన్న, కంది, కొర్ర, సజ్జ, ఆముదం విస్తీర్ణం బాగా పెరగ్గా, పత్తి 82 శాతం విస్తీర్ణం నమోదైంది. 1.20 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వీలుగా త్వరలోనే 80 శాతం రాయితీతో ఉలవలు, అలసంద, పెసలు పంపిణీ చేయనున్నారు. సెప్టెంబర్ నెలాఖరులోపు అన్ని పంటలనూ ఈ–క్రాప్‌లోకి తీసుకురానున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఇందుకోసం పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేశామన్నారు. గ్రామాల వారీగా, రైతు వారీగా, సర్వే నంబర్లు, మ్యాపింగ్, జియో కోఆర్డినేట్స్ తీసుకుని అత్యంత పారదర్శకంగా పంట నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి 1.20 లక్షల హెక్టార్లలో పంట నమోదు పూర్తయిందన్నారు. రెవెన్యూ సిబ్బందితో పాటు ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖకు సంబంధించి పంటలు కూడా ఈ–క్రాప్ చేస్తున్నట్లు తెలిపారు.





వధూవరుల బంధుమిత్రులతో కిటకిటలాడుతున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం, జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

## పెన్నహోబిలంలో సందడి

**ఉరవకొండ:** జిల్లాలోనే ప్రసిద్ధ పర్యాటక పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో ఆదివారం సందడి నెలకొంది. పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో జిల్లా నలుమూలల నుంచే కాక, పొరుగున ఉన్న కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో బంధువులు తరలివచ్చారు. దీనికి తోడు సెలవు రోజు కావడంతో పర్యాటకులు సైతం భారీగా విచ్చేయడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ప్రకృతిని ఆస్వాదిస్తూ అక్కడే వనభోజనాలు చేశారు. కొందరైతే తమ భవిష్యత్ ఎలా ఉండబోతోందని చిలుక జోస్యం చెప్పించుకునేందుకు క్యూ కట్టడం కనిపించింది.

## క్లుప్తంగా

### చీనీచెట్లు దగ్ధం


మంటల్లో కాలిన చీనీ చెట్లు

పామిడి: మండలంలోని పాళ్యం గ్రామానికి చెందిన రైతు శ్రీపతి సాగు చేసిన చీనీ తోటలోని 150 చెట్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో దగ్ధమయ్యాయి. ఆదివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో చీనీ చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

### కొనసాగుతున్న హెచ్చెల్సీ గండి పూడ్చివేత పనులు


గండి పూడ్చివేత పనులు జరుగుతున్న దృశ్యం

బొమ్మనహాళ్: బళ్లారి జిల్లా కొలగల్లు సమీపంలో హెచ్చెల్సీకి శనివారం రాత్రి గండి పడి సుమారు 15 మీటర్ల మేర కాలువ గట్టు తెగిన విషయం తెలిసిందే. దీంతో తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి శనివారం నీటి ప్రవాహం పూర్తిగా తగ్గించి గండి పూడ్చివేత పనులను అధికారులు చేపట్టారు. తుంగభద్ర జలాశయం ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పనులు వేగంగా జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం నాటికి గండి పూడ్చి వేసి జలాశయం నుంచి నీటిని హెచ్చెల్సీకి విడుదల చేయనున్నట్లు సమాచారం.

### దారి దోపిడీ ముఠా ఆధారాల కోసం ఎస్పీ పరిశీలన

గార్లదిన్నె: మండలంలోని 44వ జాతీయ రహదారిపై రూ.2 కోట్లు దోపిడీ చేసిన ముఠా ఆచూకీ కోసం పోలీసుల అన్వేషణ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఎస్పీ శ్రీనివాసరావు స్వయంగా రామ్‌దాస్‌పేట సమీపంలో పెట్రోల్ బంకు వద్ద ఉన్న సీసీ కెమెరాలు, శింగనమల క్రాస్‌లో సిమెంట్ బ్రిక్స్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటి వరకూ దారి దోపిడీకి సంబంధించి ఎలాంటి ఆధారం లభ్యం కాలేదు. అలాగే దారి దోపిడీ ముఠా సభ్యులు బ్లాక్ ఇన్నోవాలో వెళ్లినట్లు బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు సీసీ కెమెరాల్లో పరిశీలించగా దారి దోపిడీ జరిగిన రోజు బ్లాక్ ఇన్నోవా వాహనం శింగనమల క్రాస్‌లో వెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజీల్లో కనిపించింది. తిరిగి అదే వాహనం తాడిపత్రిలోకి వెళ్లినట్లు అక్కడి సీసీ కెమెరాల పుటేజీల్లో గుర్తించారు.

# కాపు నేస్తంతో కాంతులు

- ఆ సామాజిక వర్గ మహిళలకు ఆర్థిక చేయూత
- ఏడాదికి రూ.15 వేలు.. ఐదేళ్లలో రూ.75 వేలు
- ఈ నెల 30న 4వ విడత నగదు జమ
- ఉమ్మడి జిల్లాలో గత మూడు విడతల్లో 31, 914 మందికి లబ్ధి





బీసీ కార్పొరేషన్ కార్యాలయం

అనంతపురం రూరల్: సంక్షేమం... అభివృద్ధికి సమానమైన ప్రాధాన్యతనిస్తూ జగన్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాలకూ ఆపన్న హస్తాన్ని అందిస్తున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా చితికిపోయిన కుటుంబాలకు నేనున్నానంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూతనందిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కాపునేస్తం పథకం ఆ సామాజిక వర్గ మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడింది.

**సుస్థిర అభివృద్ధి దిశగా..**

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా పథకాలను ప్రవేశపెడుతూ సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కాపు, బలిజ, తెలగ, ఒంటరి, ఉప కులాల మహిళల జీవన ప్రమాణాల్ని పెంచేలా.. వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చేలా ప్రవేశపెట్టిన వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత మూడు విడతల్లో 31,914 మందికి లబ్ధి చేకూరింది. ఆయా కులాలకు చెందిన 45 నుంచి 60 ఏళ్ల లోపు మహిళల ఆర్థిక తోడ్పాటుకు ఈ పథకం దోహదపడుతోంది.

**మూడు విడతల్లో రూ.47.87 కోట్ల లబ్ధి..**

గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ. 10వేల లోపు ఆదాయం, పట్టణ పరిధిలో రూ.12 వేల ఆదాయం ఉన్న వాళ్లను అర్హులుగా గుర్తించి ఏటా రూ.15వేల నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తోంది. ఈ లెక్కన అర్హులైన లబ్ధిదారులకు ఐదేళ్లలో రూ.75 వేల లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ మూడు విడతల్లో 31,914 మంది ఖాతాల్లోకి రూ.47.87 కోట్లు జమ కాగా, ఈ నెల 30న నాల్గో విడత కాపు నేస్తం నగదు జమ కానుంది. ఈ మేరకు చర్యలు పూర్తయ్యాయి. కాగా, నాల్గో విడత కాపు నేస్తానికి ఇది వరకే పథకం అందుకుంటున్న లబ్ధిదారులు రెన్యువల్ చేసుకోగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారితో కలిపి 11,950 మందికి లబ్ధి చేకూరనుండడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ కాపు నేస్తం పథకం లబ్ధి ఇలా

| విడతలు | లబ్ధిదారులు | లబ్ధి |
|---|---|---|
| మొదటి | 10,241 | రూ.15.36 కోట్లు |
| రెండవ | 10,344 | రూ.15.51 కోట్లు |
| మూడో | 11,329 | రూ.16.99 కోట్లు |
| నాల్గో | 11,950 | రూ.17.09 కోట్లు (ఈ నెల 30న జమ) |

### గతంలో ఎవరూ గుర్తించలేదు



గతంలో ఏ ప్రభుత్వమూ మా కష్టాలను గుర్తించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాపు నేస్తం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. ఈ డబ్బుతో చిన్నపాటి వ్యాపారం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుచుకున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– సునందమ్మ, కూడేరు

### ఆర్థికంగా ముందుకు



కాపు కులాల్లో ఉన్న పేదలను గుర్తించి ఏటా కాపు నేస్తం కింద రూ.15 వేలు ఆర్థిక సాయం అందించడం గొప్ప విషయం. ఈ డబ్బు మా కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు దోహదపడ్డాయి. ఇచ్చిన మాట నెరవేర్చుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్ని వర్గాలకు అండగా నిలిచారు.

– చదువుల గంగమ్మ, నరసనాయనకుంట

### అర్హులందరికీ వర్తింపు



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కాపు నేస్తం కింద ఆర్థిక సాయం అందజేస్తున్నాం. గతంలో లబ్ధి పొందిన వారికి రెన్యువల్ చేయడంతో పాటు కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేశాం. ఈ నెల 30న వీరి బ్యాంక్ ఖాతాల్లోకి ప్రభుత్వం నగదు జమ చేయనుంది.

– సుబ్రహ్మణ్యం, ఈడీ, బీసీ కార్పొరేషన్

### కూలిన మిద్దె పైకప్పు.. వృద్ధుడి మృతి


మృతుడు వెంకట్రామిరెడ్డి

యాడికి: మట్టి మిద్దె పైకప్పు కూలడంతో శిథిలాల కింద చిక్కుకుని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం తిప్పారెడ్డిపల్లికి చెందిన ఉమ్మడి వెంకట్రామిరెడ్డి (75), పద్మావతమ్మ దంపతులు వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు టిఫన్ ముగించుకున్న తర్వాత వెంకట్రామిరెడ్డి ఇంటి అరుగుపై కూర్చొనుండగా.. పద్మావతమ్మ పనిపై బయటకు వెళ్లింది. ఆ సమయంలో మట్టి మిద్దె పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మిద్దె పూర్తిగా నానడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వెంకట్రామిరెడ్డిని వెలికి తీసే లోపు ఆయన మృతి చెందాడు. భర్త మృతితో తనకు దిక్కెవరూ అంటూ పద్మావతమ్మ రోదించిన తీరు పలువురిని కంట తడి పెట్టించింది. ఘటనపై ఎస్ఐ గురుప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### ‘ఆ’జాదూ ఎంపీడీఓ మాకొద్దు

- జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓకు మహిళా ప్రజాప్రతినిధి వినతి
- మద్యం మత్తులో విధులకు హాజరవుతున్నట్లు ఫిర్యాదు
- మహిళలతో అసభ్య ప్రవర్తన అంటూ ఆవేదన

అనంతపురం సిటీ: మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే మాయగాడైన ఎంపీడీఓ తమకు అక్కర్లేదని, ఆయనను తక్షణమే బదిలీ చేయాలంటూ జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్‌కు ఓ మహిళా ప్రజాప్రతినిధి విన్నవించింది. శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా హాజరైన సభ్యులు తొలుత ఆశ్చర్యపోయారు. తర్వాత ఎంపీడీఓ తీరుపై మండిపడ్డారు.

**మద్యం మత్తులో విధులు..**

తమ మండలంలో పనిచేస్తున్న ఎంపీడీఓ తీరు సరిగా లేదని శ్రీసత్యసాయి జిల్లా కర్ణాటక సరిహద్దులోని ఓ మండల ప్రజాప్రతినిధి (మహిళ) ఏకంగా జెడ్పీ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు మద్యం మత్తులో హాజరై ఆయన... మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వాపోయారు. గతంలో పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓ మండలంలో పనిచేసిన సమయంలోనూ ఓ చిరుద్యోగితో సహజీవనం సాగిస్తూ వివాదాలకు కేంద్రీకృతమయ్యాడు. దీంతో డిప్యుటేషన్‌పై పక్క నియోజకవర్గంలోని మరో మండలానికి బదిలీ చేసినా.. అక్కడ కూడా వివాదాల్లో చిక్కుకోవడంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేయడంతో మరో ప్రాంతానికి బదిలీ చేశారు. తాను ఏ ప్రాంతంలో పనిచేసినా.. అక్కడ పనిచేస్తున్న మహిళా చిరుద్యోగులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వేధించేవాడు. ప్రస్తుతం కర్ణాటక సరిహద్దులోని ఓ మండలంలో పనిచేస్తున్న ఆయన తన తీరు మార్చుకోక పోవడంతో విషయం కాస్త జెడ్పీ సమావేశంలో చర్చనీయాంశమైంది. ఈ అంశాన్ని జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. సమగ్ర విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు సమాచారం.

## అనారోగ్యంతో ఏఆర్ ఎస్ఐ మృతి



షంషేర్ వలి (ఫైల్), ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

యాడికి/అనంతపురం శ్రీకంఠం సర్కిల్: పది రోజులుగా అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏఆర్ ఎస్ఐ షంషేర్ వలి పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందారు. యాడికి మండలం వేములపాడు గ్రామానికి చెందిన ఆయన 1974లో పోలీసు శాఖలో చేరారు. ఆయన స్వగ్రామంలో ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, యాడికి ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులను వారు పరామర్శించారు.

### జూదరుల అరెస్ట్

తాడిపత్రి: మండలంలోని చిన్నపొడమల శివారున పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు అరెస్ట్ చేసి, రూ.82.90 వేల నగదుతో పాటు ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. అందిన ముందస్తు సమాచారంతో ఎస్ఐ మహమ్మద్‌గౌస్, సిబ్బంది తనిఖీలు చేపట్టి జూదరులను అరెస్ట్ చేసినట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

## వైఫల్యాలే విజయానికి సోపానాలు




మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి (చిత్రంలో) విశాల ఫెర్రర్, పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

- కలెక్టర్ గౌతమి
- అట్టహాసంగా గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ ప్రారంభం

అనంతపురం: వైఫల్యాల వెనుకే విజయం దాగి ఉంటుందని, ఓటమితో కుంగి పోకుండా రెట్టింపు ఉత్సాహంతో క్రీడల్లో పోటీనప్పుడే విజయం సొంతమవుతుందని క్రీడాకారులకు కలెక్టర్ ఎం. గౌతమి సూచించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహించడం గొప్ప విషయమమంటూ నిర్వాహక సంస్థ ఆర్డీటీని అభినందించారు. ఆర్డీటీ స్పోర్ట్ ఫర్ డెవలప్‌మెంట్ సెక్టార్ ద్వారా అనంత క్రీడాగ్రామం వేదికగా గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ – 2023 పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కలెక్టర్ గౌతమి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ నిర్వహించడం శుభ పరిణామన్నారు. ఆర్డీటీ సేవలను కొనియాడారు. ఈ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో వివిధ స్థాయిల్లో 3 వేల మంది క్రీడాకారులు పోటీ పడగా.. ప్రతిభ చాటుకున్న 350 మందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 38 ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. మూడు రోజుల పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం పోటీలు ఉత్సాహంగా సాగాయి. 100, 200, 400, 4X100 మీటర్ల రిలే పరుగుతో పాటు లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తొలి రోజు విజేతలు ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే సెమీ–ఫైనల్, ఫైనల్స్‌లో పోటీపడేందుకు అర్హత సాధించారు.



### అవెన్యూ ప్లాంటేషన్ విస్తీర్ణం పెంపు

అనంతపురం టౌన్: జిల్లాలో అవెన్యూ ప్లాంటేషన్ విస్తీర్ణాన్ని పెంచినట్లు ప్లాంటేషన్ మేనేజర్ సునీల్ తెలిపారు. జిల్లాలో 120 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, సంరక్షణ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఇప్పటికే 100 కిలోమీటర్ల మేర మొక్కలను నాటే కార్యక్రమం పూర్తయిందన్నారు. ఇందు కోసం ఉపాధి నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు మరో 500 హెక్టార్ల విస్తీర్ణంలోని కొండగుట్టల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## వ్యక్తి ప్రాణాలు కాపాడిన సీఐ

- భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం
- సకాలంలో స్పందించిన సీఐ శంకరరెడ్డి


పెద్దిరెడ్డిని సముదాయిస్తున్న సీఐ శంకరరెడ్డి (చిత్రంలో) ఎస్ఐలు గురుప్రసాదరెడ్డి, శ్రీనివాసులు

యాడికి: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేయబోయిన వ్యక్తి ప్రాణాలను సీఐ శంకరరెడ్డి సకాలంలో కాపాడారు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తి నివాసి పెద్దిరెడ్డికి నాలుగేళ్ల క్రితం శింగనమల మండలం బండమీదపల్లికి చెందిన యువతితో వివాహమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో కొన్నాళ్ల క్రితం ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పలుమార్లు భర్త ప్రాధేయపడిన ఆమె కాపురానికి రాలేదు. ఈ క్రమంలో పెద్ద మనుషుల పంచాయితీ నిర్వహించి, నచ్చచెప్పినా ఆమె రాజీ పడలేదు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న పెద్దిరెడ్డి ఆదివారం యాడికి మండలం రాయలచెరువులోని ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఉన్న పట్టాలపైకి చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇదే విషయాన్ని తన కుటుంబ సభ్యులతకు వీడియో కాల్ చేసి తెలిపాడు. అప్రమత్తమైన పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించడంతో విషయం తెలుసుకున్న యాడికి సీఐ శంకరరెడ్డి, ఎస్ఐలు గురుప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పెద్దిరెడ్డి ఉన్న ప్రాంతాన్ని గుర్తించి, అక్కడకు చేరుకున్నారు. అప్పటికే పట్టాలపై పడుకుని రైలు రాక కోసం వేచి చూస్తున్న పెద్దిరెడ్డిని గమనించి, వెంటనే పక్కకు లాగారు. అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించడమే కాక, పెద్దిరెడ్డి భార్యతో ఫోన్‌లో మాట్లాడి ఆమె కాపురానికి వచ్చేలా ఒప్పించారు.

# సాగుదారులకు ‘హక్కు’

- భూ పంపిణీకి రెవెన్యూ శాఖ కసరత్తు
- నాలుగు నియోజకవర్గాల జాబితా ఖరారు
- అప్రూవల్‌కు మరో మూడు నియోజకవర్గాల జాబితా
- ప్రస్తుతం 1,140 మందికి 1,511.61 ఎకరాల గుర్తింపు


భూ పంపిణీ ద్వారా లబ్ధిదారులకు అందజేయనున్న సాగుభూమి

అనంతపురం అర్బన్: రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా జగన్ సర్కారు పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఏళ్లుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు మేలు చేసేదిశగా అడుగులు వేస్తోంది. సాగు చేస్తున్న భూమికి సంబంధించి రైతులకు భూ పంపిణీ ద్వారా సాగు హక్కు కల్పించి.. శాశ్వత లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూ పంపిణీకి రెవెన్యూ శాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం నాలుగు నియోజకవర్గాల పరిధిలో 1,140 మంది రైతులు 1,511.61 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు గుర్తించి.. లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశారు. మరో మూడు నియోజకవర్గాలకు సంబంధించి జాబితాను అప్రూవల్‌కు ఉంచారు. ఇది అప్రూవల్ అయితే 500 ఎకరాలు పెరగవచ్చని అంచనా. తద్వారా మరో 350 మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది.

**నాలుగు నియోజకవర్గాల ఖరారు..**

ప్రస్తుతం గుంతకల్లు, శింగనమల, రాయదుర్గం, తాడిపత్రి నియోజకవర్గాల పరిధిలో భూ పంపిణీకి 1,140 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరు 1,511.61 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు నిర్ధారిస్తూ జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. అలాగే కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాప్తాడు (ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలు) నియోజకవర్గాల జాబితాను అప్రూవల్ కోసం అధికారులు పంపినట్లు తెలిసింది. ఈ మూడు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 500 ఎకరాల ప్రభుత్వ భూమిని సుమారు 350 మంది రైతులు సాగు చేస్తున్నట్లు గుర్తించారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూమి సాగులో లేనట్లు తేలింది.

**ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే...**

భూ పంపిణీకి సంబంధించిన ప్రక్రియను రెవెన్యూ యంత్రాంగం నెల రోజుల్లో పూర్తి చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి ఉంచుతారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తరువాత జిల్లావ్యాప్తంగా భూ పంపిణీ కింద లబ్ధిదారులకు సాగు హక్కు పట్టాలు అందజేస్తారు.

ప్రస్తుతం సిద్ధమైన జాబితా

| మండలం | లబ్ధి దారులు | గుర్తించిన భూమి (ఎకరాల్లో) |
|---|---|---|
| పామిడి | 119 | 134.75 |
| గుత్తి | 215 | 254.31 |
| యాడికి | 37 | 51.33 |
| పెద్దపప్పూరు | 51 | 75.84 |
| గార్లదిన్నె | 46 | 51.74 |
| పెద్దవడుగూరు | 110 | 127.39 |
| గుంతకల్లు | 105 | 145.39 |
| శింగనమల | 13 | 21.53 |
| నార్పల | 188 | 264.71 |
| డి.హీరేహాళ్ | 23 | 47.84 |
| పుట్లూరు | 30 | 41.13 |
| రాయదుర్గం | 23 | 28.04 |
| బొమ్మనహాళ్ | 87 | 129.35 |
| బుక్కరాయసముద్రం | 23 | 33.85 |
| గుమ్మఘట్ట | 58 | 73.13 |
| రాప్తాడు | 6 | 15.86 |
| యల్లనూరు | 6 | 15.42 |
| మొత్తం | 1,140 | 1,511.61 |

### ప్రక్రియ పూర్తి కావచ్చింది



జిల్లాలో భూ పంపిణీకి అవసరమైన ప్రక్రియ పూర్తికావచ్చింది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారులు జాబితా, వెబ్‌ల్యాండ్ కరెక్షన్ కూడా పూర్తయ్యింది. మిగిలిన నియోజకవర్గాల పరిధిలోని జాబితా త్వరలోనే సిద్ధమవుతుంది.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

## క్లుప్తంగా

### తోపుదుర్తిలో పశుగర్భకోశ చికిత్స శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న సిబ్బంది

**ఆత్మకూరు:** మండలంలోని తోపుదుర్తి గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్య అధికారి తులసీ రామ్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామంలోని పశువులను పరీక్షించేందుకు ఉచిత గర్భకోశ శిబిరం ఏర్పాటు చేశారు.

### సంతల ఆదాయం రూ.2.96 లక్షలు

**అనంతపురం అగ్రికల్చర్:** స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.96 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్, సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,36,400 వసూలు అయ్యింది. ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,60,200 మేర వసూలు అయినట్లు వారు తెలిపారు.

### తాడిపత్రి బిర్యానీ సెంటర్ ప్రారంభం



తాడిపత్రి బిర్యానీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత తదితరులు

**అనంతపురం క్రైం:** నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తాడిపత్రి బిర్యానీ సెంటర్‌ను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, నాయకులు అంబటి ఆదినారాయణ రెడ్డి, తిరుమలరెడ్డి, బిర్యానీ సెంటర్ నిర్వాహకుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం



ప్రతిష్టకు సిద్ధంగా ఉన్న పెద్దమ్మ విగ్రహం

**ఆత్మకూరు:** మండల కేంద్రంలో పాలిమేర పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నూతన పెద్దమ్మ తల్లి విగ్రహానికి పూజలు చేసి, నూతనంగా నిర్మించిన ఆలయం వద్ద పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఆదివారం గంగపూజ, గోపూజ, గణపతి పూజ, రక్షాబంధం, ప్రధాన కలశ స్థాపన, నవగ్రహారాధన తదితర పూజలు నిర్వహించారు. 29న విగ్రహ ప్రతిష్ట ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

### నేడు 'స్పందన'

**అనంతపురం క్రైం:** నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు స్పందన కార్యక్రమం జరగనుంది. నగర ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే వినతుల రూపంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని అదనపు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

### సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



**గార్లదిన్నె:** కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, 108 శివలింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

### విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

**గార్లదిన్నె:** మండలంలోని మర్తాడులో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అర్చకులు ఉదయం గణపతి పూజ నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ట, అభిషేకం, పూజలు ఉంటాయని వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు.

# సన్‌డే సెగలు

వేసవి కాలం ఎప్పుడో ముగిసింది. వానా కాలం వచ్చింది.. ఉదయం చల్లనిగాలి, మధ్యాహ్నం వడగాలి, సాయంత్రం ఈదురుగాలి.. ఇలా వర్షాలు కురిసే వేళ ఇది..ఆగస్టు నెల అంతమై, సెప్టెంబర్ ఆరంభం కానుంది. 'సన్‌డే' కూడా.. చల్లని వాతావరణంలో సేదతీరాల్సిన సమయంలో ఎండలు 'మండే'లా సెగలు కక్కుతున్నాయి. ఇంట్లో ఉంటే ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మిట్టమధ్యాహ్నం మాడు మాడుతుందని గొడుగు నీడన, కొంగుచాటున వెళ్లాల్సి వస్తోంది. వాహనదారులు కూడా టోపీలు ధరించి వెళ్లాల్సి వచ్చింది. నగరంలో కళింగర పండ్లు తింటూ , శీతల పానీయాలు, కొబ్బరినీళ్లు తాగుతూ అక్కడక్కడ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



మండే ఎండకు రక్షణగా టోపీ ధరించి వెళ్తున్న వాహనదారుడు



గొడుగునీడన వెళ్తున్న మహిళ



మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా ఉన్న అంబేద్కర్ రోడ్డు



చెరుకు రసం విక్రయ కేంద్రం వద్ద గుమిగూడిన జనం



ఎండవేడిమి తట్టుకోలేక కలింగర ఒప్పులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

### పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయం

- జేఎన్‌టీయూ వీసీ జింకా రంగ జనార్దన

**అనంతపురం:** జేఎన్‌టీయూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు అభినందనీయమని వీసీ జింకా రంగ జనార్దన తెలిపారు. ఆదివారం జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 1994–98 బ్యాచ్ విద్యార్థులు కళాశాలను సందర్శించారు. మెకానికల్ సెమినార్ హాలులో పూర్వ విద్యార్థులు సమావేశమై, ఉపకులపతి ఆచార్య రంగ జనార్దనతో ఆన్‌లైన్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతో గొప్ప హోదాల్లో ఉన్నారని, కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్ మాట్లాడుతూ కళాశాలకు అల్యూమినీ అసోషియేషన్ బలం అని, యూనివర్సిటీ అభివృద్ధికి వీరి సలహాలు, సూచనలు ఎల్లప్పుడూ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ హరినాథ్‌రెడ్డి, శివరామిరెడ్డి (లండన్), డాక్టర్ ఎం. నాగమణి (హైదరాబాద్), ఓబుల్‌రెడ్డి (మైక్రోసాఫ్ట్ కంపెనీ, పూణే), మనోహర్‌రెడ్డి (ఎంవీఐ), శ్రీనివాసులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పథంలో అనంతపురం

- రూ. 4.52 కోట్ల ఎన్‌క్యాప్ నిధులతో సుందరీకరణకు చర్యలు
- పలు ప్రాంతాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు
- అనంతకు శోభ తెచ్చేలా గ్రీనరీ



సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి రోడ్డుకిరువైపులా పరుచుకున్న పచ్చదనం

**అనంతపురం క్రైం:** వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నగరానికి మహర్దశ కలిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలుండడంతో నగరాభివృద్ధి కుంటుపడింది. ఎక్కడిక్కడ పనులు నిలిచిపోయి ఉండేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. ఇటీవల నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్)లో భాగంగా నగరపాలక సంస్థకు రూ.4.52 కోట్లు మంజూరయ్యాయి.

= నగరంలో 2021–22లో కాలుష్య నియంత్రణలో భాగంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్‌క్యాప్ నిధులు రూ.3.55 కోట్లలో అభివృద్ధి పనులు జరిగాయి. ప్రస్తుతం రూ.4.52 కోట్లతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే రూ.1.98 కోట్ల వ్యయంతో సూర్యనగర్ రోడ్డు పనులు, సుందరీకరణ, రోడ్డు భద్రతలో భాగంగా ప్రభుత్వ వైద్య కళాశాల ఎదుట రూ.10 లక్షలతో పేవర్ బ్లాక్స్ పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల సూర్యనగర్ రోడ్డు పనులను ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం ప్రారంభించారు.

**నగర సుందరీకరణకు పెద్దపీట:**

నగర సుందరీకరణతో పాటు కాలుష్య నియంత్రణలో భాగంగా పలు ప్రాంతాల్లో పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు రూ.60 లక్షల వ్యయంతో వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేయనున్నారు. అందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాంనగర్ అండర్ బ్రిడ్జ్ వద్ద రూ.34 లక్షలతో గ్రీన్ కవర్ విత్ ల్యాండ్ స్కేప్, రూ.40 లక్షలతో కళ్యాణదుర్గం బైపాస్ వద్ద గ్రీన్ కవర్ విత్ ల్యాండ్ స్కేప్ ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పూడికతీత పనులు కూడా చేపట్టనున్నారు.

> **శరవేగంగా అభివృద్ధి పనులు**
>
> నగరంలో జీజీఎంపీ, జనరల్ ఫండ్, సీఎం ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు దశలవారీగా శరవేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు ఎన్‌క్యాప్ నిధులతో నగరం మరింత అభివృద్ధి చెందుతుంది. పనులు వేగవంతం చేసేలా అధికారులకు ఆదేశాలు చేశాం.
>
> - భాగ్యలక్ష్మి, కమిషనర్, నగరపాలక సంస్థ

## ముగిసిన చెస్ చాంపియన్‌షిప్ పోటీలు



గెలుపొందిన చెస్ క్రీడాకారులు

**అనంతపురం:** నగరంలో కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–15 ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్–2023 పోటీలు ఆదివారంతో ముగిశాయి. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం 8 రౌండ్ల పోటీలు నిర్వహించారు. అందులో 8/8 పాయింట్లతో చాంపియన్ షిప్ టైటిల్‌ను విజయవాడకు చెందిన ఫిడే మాస్టర్ యండి ఇమ్రాన్ (క్లాసికల్ రేటింగ్ 2197) సాధించాడు. రన్నరప్‌గా అనంతపురం జిల్లాకు చెందిన శామ్యూల్ స్టీఫెన్ నోబల్ 7/8 పాయింట్లు సాధించాడు. మూడో స్థానం తూర్పుగోదావరికి చెందిన రామ్‌చరణ్‌తేజ 6.5/8 పాయింట్లు సాధించాడు. 4వ స్థానం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీతాసాగర్ 6.5/8 పాయింట్లు సాధించాడు. ప్రతిభ చూపినవారికి 32 నగదు బహుమతులు అందించారు. టాప్ 4 క్రీడాకారులను రాష్ట్రం తరపున జాతీయ స్థాయి అండర్ 15 ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేసినట్లు టోర్నీ ఆర్గనైజర్ శ్రావణ్‌కుమార్, అసోషియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవ చైర్మన్ బాలరాజు తెలిపారు. విజేతలకు ప్రిన్సిపాల్ శంకరయ్య, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాంతి భరత్, జీవన్‌కుమార్, అతిథులు సుప్రజాచౌదరి, లక్ష్మీరంగయ్య, శ్రీనివాసప్రసాద్, ఉదయ్‌కుమార్‌నాయుడు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

## స్టాండింగ్ కమిటీకి ఐదు నామినేషన్ల దాఖలు



**అనంతపురం క్రైం:** నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఐదుగురు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులకు ఐదుగురు కార్పొరేటర్లు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ నెల 19న స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. నామినేషన్ దాఖలుకు ఆదివారం చివరి రోజు కావడంతో కార్పొరేటర్లు తరిమెల అబూసాలేహ (డివిజన్ 14), కంసల లీలావతి (డివిజన్ 22), గురుశేఖర్‌బాబు (డివిజన్ 50), ఎం. రాజేశ్వరి (డివిజన్ 46), సంపంగి రామాంజనేయులు (డివిజన్ 24), నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 27న నామినేషన్ పత్రాల ప్రచురణ, 28న పరిశీలన, అదే రోజు వ్యాలిడ్ నామినేషన్ పత్రాల ప్రచురణ ఉంటుంది. ఈ నెల 29న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం 4 గంటలకు బరిలో ఉన్న ఐదుగురి అభ్యర్థుల జాబితాను విడుదల ఉంటుంది. ఈ నెల 31న నగరపాలక సంస్థలోని నూతన భవనంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుందని నగరపాలక సంస్థ కార్యదర్శి తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఎన్నికల్లో పోటీ లేకపోవడంతో దాదాపుగా ఏకగ్రీవం కానున్నాయి. ముఖ్యంగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసిన వారిలో మెజార్టీ కార్పొరేటర్లు బీసీలే ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి బీసీలకే పెద్దపీట వేశారు.

## కలెక్టర్, ఎస్పీని కలిసిన టీటీడీ సభ్యుడు





కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్

**అనంతపురం అర్బన్:** తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి (టీటీడీ బోర్డు) సభ్యుడు అశ్వర్థనాయక్ కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కె.శ్రీనివాసరావును ఆదివారం వారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి కృప, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో తనకు ఇంతటి గొప్ప హోదా దక్కిందన్నారు. బడుగుబలహీన వర్గాలకు రాజకీయ ఉన్నతి కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గిరిజనులందరం ఆయనకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్, అగ్రికల్చర్ అధికారి శేఖర్‌నాయక్, ప్రసాద్, గిరిజన సంఘం నాయకులు రంగానాయక్, దశరథ్ నాయక్, ధనుంజయనాయక్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### 1న చలో విజయవాడ

**రాప్తాడురూరల్:** సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న తలపెట్టిన 'చలో విజయ వాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, సిరాజుద్దీన్, సబ్ కమిటీ సభ్యులు సతీష్‌కుమార్, ఓబులేసు, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్‌వలి, నాయకులు నాగభూషణం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

### వేతనాలు చెల్లించాలి

**రాప్తాడురూరల్:** గత జూన్‌లో బదిలీ అయిన టీచర్లు, రీ- అపోర్స్‌మెంట్, పదోన్నతులు పొందిన టీచర్లకు వేతనాలు మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ (1938) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు.కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పీవీ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. రవీంద్ర, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయగిరి మహమ్మద్ రఫీ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీంద్ర, శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు ఆంజనేయులు నాయక్, శ్రీనివాస నాయక్ పాల్గొన్నారు.

## రాయలసీమ సాంస్కృతిక ఉద్యమం రావాలి

- జనచైతన్య సదస్సులో ప్రముఖ రచయిత రమేష్



రాయలసీమ సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత రమేష్

**అనంతపురం కల్చరల్:** రాయలసీమ గొప్పతనం వివరించే సాంస్కృతిక ఉద్యమం రచయితలు, మేధావుల నుంచే రావాలని ప్రముఖ రచయిత రమేష్ అన్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజ్ డ్రామా హాలులో 'రాయలసీమ సంస్కృతిపై సమాలోచన' కార్యక్రమం నిర్వహించారు. రాయలసీమ జనచైతన్య వేదిక 100 టీఎంసీ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేర్వే విభాగాల్లో సదస్సు జరిగింది. ఆచార్య సదాశివరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. రచయిత, మౌఖిక సాహిత్య పరిశోధకుడు రమేష్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. రాయలసీమలో ముఖ్యంగా అనంతలోని పలు కళారూపాల విశిష్టతను ఆయన వివరించారు. ఎన్నో కళారూపాలు అంతరించిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా, ప్రముఖ వ్యక్తుల విలక్షణ వ్యక్తిత్వాలు, కళారూపాల ప్రత్యేకతపై అందరికీ తెలియజెప్పాల్సిన బాధ్యతను రచయితలు, కవులు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రాయలసీమకు రావాల్సిన నికరజలాలపై ప్రధాన చర్చజరిగింది. పాండవుల కళారూప ప్రదర్శన, రాయలసీమ ముఖచిత్రం తెలిపే మ్యాపులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, యువ రచయిత్రి చిలుకూరు దీవెన, రచయితలు, కవులు, రాయలసీమ ఉద్యమ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం

**అనంతపురం టవర్‌క్లాక్:** చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో జిల్లా శాఖ సభ్యుడు సత్యంబాబు అధ్యక్షతన జరిగిన 'ఉమ్మడి పౌరస్మృతి ఎవరి కోసం' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ ఇప్పుడున్న చట్టాల్లో ఉమ్మడి అంశాలపై అందరూ తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ చట్టాల ఆవశ్యకత ఏ విధంగా రూపాంతరం చెందిందో గణాంకాలతో వివరించారు. మానవహక్కుల వేదిక నాయకులు ఇక్బాల్, ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నరసింహమూర్తి, మల్లికార్జున, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో పోటెత్తిన పంపనూరు ఆలయం



బంగారు కవచ అలంకరణలో సర్పరూపుడు



అలంకరణలో రాప్తాడు ఆలమూరప్పస్వామి



ఆలయంలో కాల సర్పదోష, రాహుకేతు హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం



స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

**ఆత్మకూరు:** మండలంలోని పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. శ్రావణమాస రెండో ఆదివారం పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక , ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆదివారం శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా లక్ష్మి అష్టోత్తర సహిత విష్ణు సహస్ర నామ పారాయణం, లింగాష్టకం తదితర పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి మూల విరాట్‌కు విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు చేశారు. పట్టువస్త్రాలు, బంగారు కవచంతో స్వామిని అలంకరించి, పూజలు చేశారు. ఆలయంలో కాల సర్పదోష, రాహుకేతు హోమాలు నిర్వహించారు. అలాగే మంజునాథస్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**భక్తిశ్రద్ధలతో నాగుల ప్రతిష్టలు**

**అనంతపురం కల్చరల్:** నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని అక్కల్‌కోట మహారాజ్‌వలీస్వామి ఆశ్రమంలో మూడు రోజులుగా సాగుతున్న నాగుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహం, ఆంజనేయస్వామి, నాగుల విగ్రహాల ప్రతిష్టను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం మూలమంత్ర, గణపతి హోమాలు జరిగాయి. మధ్యాహ్నం అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజనానికి అన్న ప్రసాదం అందించారు. సాయంత్రం సామూహిక భజనలు జరిగాయి. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు విజయ్‌కుమార్, సీతాలక్ష్మి, నాగేశ్వరరావు, విజయ్‌సాయి, రాంభూపాల్ పాల్గొన్నారు.



రాప్తాడు వీధుల్లో ఊరేగుతున్న ఆలమూరప్ప స్వామి

**వైభవంగా ఆలమూరప్ప స్వామి ఊరేగింపు**

**రాప్తాడు:** మండల కేంద్రంలోని ఆలమూరప్ప స్వామి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం కురుబ కులానికి చెందిన శీల్దా కాపుల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. కనగానపల్లి మండలంలోని తూంచెర్లలో వెలసిన ఆలమూరప్ప స్వామిని స్వామి కాపులు శనివారం సాయంత్రం గ్రామానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రంతా గ్రామంలో స్వామిని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఆదివారం సాయంత్రం కూడా గ్రామంలో కాపులు భక్తి శ్రద్ధలతో స్వామిని ఊరేగించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అనంతపురం టౌన్:** నగరంలో సోమవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. శారదానగర్, విజయనగర్ కాలనీ, ఫెర్రర్ కాలనీ, టీవీ టవర్, పంగల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు.

### రాయితీతో గడ్డి కోసే యంత్రం

**బుక్కరాయసముద్రం:** రాష్ట్ర ప్రభుత్వం పాడి పశువుల పెంపకం చేసే రైతులకు రాయితీతో గడ్డి కోసే యంత్రం అందిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రత్న కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.